

ప్రమదావనం

# కడుపుతీపి...?

— హిమబిందు

**"ఏమిటి,** వనజా! ఇంకా రెడి అవలేదు?" ఆఫీసు నుండి వచ్చి ఆశ్చర్యంగా చూశాడు భార్యవైపు మూర్తి.

పుట్టింటివాళ్ళు పండుగ అని ఆహ్వానించారు ఉత్తరం ద్వారా. వనజకు అంతగా ఇష్టం లేదు. మూర్తికి మామగారంటే ప్రేమ. ఆయన్ని బాధ పెట్టడం బాగుండదు వెళ్దాం, అని ఆఫీసుకు వెళ్తూ—వచ్చే సరికి రెడీగా ఉండమన్నాడు. భార్య బట్టలు అవి ఏవీ సర్దక పోవటం చూసి మరొకసారి అడిగాడు .

"మన ఇంట్లో పండగ లేదాండీ?"

మూర్తి చిరునవ్వుతో భార్య దగ్గరికి వచ్చాడు.

"నువ్వెందుకంటున్నావో నాకు తెలుసు... సంధ్య వస్తుంది... వాళ్ళది ఉన్న కుటుంబం. మీ వదిన క్లాసుగా ఉంటుంది... వారి మధ్య తక్కువగా కనిపించటం ఎందుకని... అవునా!"

పలచగా నవ్వింది వనజ ఆమె కళ్ళలో నీళ్ళు రాలాయి.

"అందరితో పోల్చుకునే దాన్నే అయితే మీతో కాపురం చేసేదాన్ని కాదు." అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మూర్తి మనసు చివుక్కుమంది... వనజ అంటే ఎంతో ప్రేమ... తనకు ఏలోటూ రాకుండా ఎంతో జాగ్రత్తగా చూస్తుంది. తను బడిపంతులు. ఇది వరకు బ్రతకలేక బడిపంతులు అనేవారు ఇప్పుడు బ్రతకటానికి బడిపంతులు అనాల్సివస్తుంది బడిపంతుళ్ళను...తనకేముంది? సంపాదిస్తున్నాడు... వనజను సుఖపెడుతున్నాడు. పిల్లలు లేరనే దిగులు తప్పితే... దిగులు తను పడడు.... వనజే!

"అంతలోనే కోపమా? ఏమన్నానని..." కాఫీ కప్పుతో వనజ ఎదురుగా...

పది సంవత్సరాల నుండి కాపురం చేస్తున్నా వనజ ఈ రోజే తన దగ్గరికి వచ్చిందా? అని అనిపిస్తుంది...


"కోపమా? నీమీదనా?" అంటూ దగ్గరికి తీసుకుని కాఫీ త్రాగి కప్పు భార్యచేతికిచ్చి 'మరి వద్దా?' అన్నాడు.

"మీ ఇష్టం."

"వెళ్దాం పద." సరే అన్నట్లు తలవూపి బట్టలు సర్దసాగింది.

• • •

ఎదురొచ్చిన మామగారు అప్యాయత కురిపించారు. మూర్తి మనసు తృప్తిగా అయింది. తనకు నాన్నగారంటే ఎంతో ప్రేమ... మారేజీ అయిన రెండు సంవత్సరాలకు చనిపోయారు. అప్పటి నుండి మామగారిలోనే తండ్రిని చూసుకుంటున్నాడు.



సంధ్యను, వదినను, తల్లిని పలుకరించింది . . . సంధ్య భర్త తెచ్చిన పట్టుచీర తల్లికి చూపిస్తూ తనను పట్టించుకోనేలేదు. వదిన చెంబుతో కాళ్ళకు నీళ్ళు ఇచ్చి మళ్ళీ పట్టుచీర చూడసాగింది . . . ఆ నీళ్ళు తీసికెళ్ళి భర్తకు ఇచ్చి లోపలికి వచ్చింది.

"ఏమే ఇప్పుడా రావటం . . . సంధ్య మూడు రోజులవుతుంది వచ్చి . . ." అంది ప్రేమగా సంధ్య వైపు చూస్తూ . . .

"వీలు కాలేదమ్మా!"

"ఇంజనీరా? డాక్టరా? వీలుగాకపోవటానికి . . . ఆఫ్టరాల్ బడిపంతులేగా?" మూతిమూడు వంకర్లు తిప్పింది . . . సంధ్య . . .

వనజ ఏమీ అనకూడదు అనుకుని ముభావంగా ఉంది. వదిన టీ ఇస్తే త్రాగింది. ఆ రాత్రి మూర్తి మామగారు మాట్లాడుతుంటే వాకిట్లో గన్నేరు చెట్టు క్రింద మంచం మీద కూర్చున్నారు.

ఇంట్లో ఇద్దరు కూతుళ్ళ . . . తల్లి, వదిన మాట్లాడుకోసాగారు. అన్న దూరంగా జాబ్ చేస్తాడు ఈ పండగకు రాను అని లెటర్ వ్రాశాడు.

"ఈ మధ్య ఏవైనా చీరెలు కొనుక్కున్నావా, అక్కా!"

"కొనుక్కోలేదే!"

"పిల్లలు లేరు...పెద్ద ఖర్చు ఉండదు. ఏం చేస్తారే డబ్బంతా . . ."

చిన్నగా నవ్వింది వనజ.

"అమ్మా . . . అది మనలాగా చెప్పదు...గుట్టు" అంది తల్లి.

"మనలో మనం సాధక బాధకాలు చెప్పుకుంటాం పరాయివాళ్ళంగాదుగా."

పరాయి వాళ్ళే నయం మీ కంటే—మనసులో అనుకుంది.

"ఏం కూర చెయ్యమంటారు అత్తయ్యా..." లేవబోయింది.

"ఆ. ఉదయం కూర, పచ్చడి ఉంది అవి చాలులే. అల్లుడుగారూ అంతగా పట్టించుకునే వారు గాదు" అంది పెద్దకూతురు కేసి చూసి నవ్వుతూ . . . వంటి నిండా కారం రాసినట్లనిపించింది.

ఉన్నవూరి అల్లుడికి పొట్టాశ . . . పొరుగూరి అల్లుడికి బట్టాశ అన్నట్లుగా ఉంటుంది వీళ్ళ ప్రవర్తన.

"మరిదిగారు రాలేదేం?" ఏదో మాట్లాడాలి గనుక అడిగింది.

"రేపు వస్తారు వారు . . . ఇంజనీర్ గదా . . . వర్క్ బాగా ఉంది . . . అయినా నాన్నగారు రావాడదూ . . . ఎవర్నో పంపమంటే. ఆయన ఎంతో బాధపడ్డారు."

తల్లి చెప్పవద్దన్నట్లు సైగ చేసింది. గమనించింది వనజ.

"ఫరవాలేదమ్మా! నేను ఏమీ అనుకోను. మనుషులను బట్టి మర్యాదలు . . . ఆ మాత్రం నాకు తెలుసు. . .స్నానంచేసి వస్తా . . ." అంటూ లేచింది.

స్నానం చేస్తూ ఆలోచించసాగింది.

అందుకే అంటారు కన్నతల్లిదే వలపక్షం. భూదేవిదే వలపక్షం అని. మన పొలం ఎంతో మంచిగా పండవచ్చు. పక్క పొలమే పండక పోవచ్చు. ఇద్దర్నీ నవ మాసాలు మోసి కన్నది. కన్నది వ్రాతల్ని కన లేదు. తనకు తాను ఎంతో అదృష్టవంతురాలు అనుకుంటుంది. వీళ్ళకు తనంటే చులకన, హేళన. ఏవగింపు. కేవలం డబ్బులేని మనుషుల్లా కనపడటమే. సంపాదించింది అంతా ఖర్చు పెట్టి డాంబికంగా కన్పించకపోవటం వలన. సంపాదనను బట్టి మర్యాదలు. హోదాను బట్టి మర్యాదలు, కడుపు తీపి ... ఇదేనా కడుపుతీపి?

ఎవరు ఎంత సంపాదించినా పొట్టకోసమే. తనకు మెడలో ఒక బంగారం గొలుసైనా లేదని, అనువుగా చీరలు లేవని, ధైర్యంగా మాట్లాడలేనని ఎన్నో అంటారు. అత్తగారు, ఆడపడుచు, మరిది వారిని సాకాలి. తన బాధ్యత అది. తనకు పిల్లలు లేక పోవచ్చు. కానీ వారు ...

వీళ్ళు చెప్తారు తెగించాలని. తల్లి ప్రతి బిడ్డను ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా పెంచుతుంది. ఆమె రెక్కలు విరిగిన పక్షి అయినప్పుడు ఆమెను అపురూపంగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి కొడుక్కు ఉంది. అనుకోకుండా వాళ్ళను మూర్తి ఏదైనా అంటే వనజ అటే సపోర్టు అవుతుంది. వారి మీద ఈగ వాలినా, ఆమెకు కష్టమే. వారికి వనజంటే పంచప్రాణాలు. అనుకోకుండా దూరంగా ట్రాన్స్






073

ఫర్ అయినందుకే ఎంతో బాధపడి వచ్చారు. ఖర్చు తగ్గటం కాదు, తమ దృష్టిలో పెరగటం. కానీ, అందరి దృష్టిలో వేరే ఉన్నారు హాయిగా అంటారు.

ఉన్నంతలో పొదుపుగా వాడుకుంటే చాలదా? లేనిపోని దర్పం అంటే వనజకు అసహ్యం. అటూ ఇటూ తిరుగుతూ ముభావంగా గడిపింది. మూర్తి గమనిస్తూనే ఉన్నాడు. తండ్రితో కాసేపు మాట్లాడింది. తెల్లవారుతూనే ఇంకో అల్లుడు దిగాడు.

ఇంట్లో అప్పుడు మొదలయింది పండగ. ఆర్భాటం అంతా ఇంతా కాదు. నవ్వుకుంది వనజ. అతను ఎంతో గంభీరంగా ఉంటాడు. స్టయిల్ ఎక్కువ. మాట్లాడితే పాంట్ ఇస్త్రీ మడత పోతుందేమో అన్నటు ప్రవర్తిస్తాడు.

ఆ రోజు ఇంకో వార్త తెలిసింది తనకు. సంధ్య కడుపుతో ఉందని. ఆమెను ప్రత్యేకంగా చూస్తుంటే తట్టుకోలేకపోయింది. తను బీద ఇంటి దనేగా ఇంత చులకన. తండ్రి మాటకు లెక్కలేదు ఆ ఇంట్లో.

సాయంత్రం పూట సంధ్యను, సంధ్య భర్తను కూర్చోబెట్టి బట్టలు పెడుతుంటే శరీరాన్నిరంపంతో కోసినట్లయింది. మూర్తి ఎంత బాధపడతాడో అని అనుకుంది. తల్లి లోపలికి పిలిచి ఈ సారి మీకు పెడతాం. అతను బట్టలు పెడితేనే వస్తానన్నాడట అని తల్లి చెబుతుంటే ఆపుకున్న కోపం బుస్సున పొంగింది.

''కన్నతల్లే తేడాలు చూపిస్తున్నప్పుడు ఎవరిమీదో ఎందుకనుకుంటా మమ్మా. ఏ నాడూ మమ్మల్ని గౌరవంగా చూడలేదు. మాకు లెటర్ వ్రాశారు. అతనికి మనిషిని పంపారు. ఫీల్ గాలేదు. నాకు పిల్లలు లేరు. దానికి పుట్టబోతున్నారు. దాని భర్త ఇంజనీర్. నా భర్త బడిపంతులు. దానికి ఎంతో ఫర్నిచర్ ఉంది. నాకు లేదు. దాని కెన్నో చీర లున్నాయి నాకు లేవు. ఇవన్నీ నాకంటే ఎక్కువగా అది సంపాదించుకున్న క్వాలిఫికేషన్స్. మీ దృష్టిలో అభిమానం. ప్రేమ. కడుపు తీపి కంటే వాటికే విలువ ఎక్కువ. మీరు పెట్టలేదని మేము ఎప్పుడూ ఫీల్‌కాము. మాకు కొనుక్కోగల శక్తి ఉంది. సాయంత్రం అయింది. ఇక వెళ్దాం మేము. రేపు స్కూలు ఉంది.''

''పండగ రోజా ''

'' ఊ. మా అత్తగారు రమ్మన్నారు. అక్కడ ఈ రాత్రి ఉండి రేపు వెళ్తాం'' అంటూ వెనక్కు తిరిగింది. భర్తను చూసి ముఖం తిప్పుకుని వెళ్ళబోయింది.

''రెడీ అయ్యావా, వనజా! త్వరగా వెళ్దాం. బస్సు టైమయింది'' అంటున్న భర్తనుచూసి తెల్లబోతూ ఆనందంతో బట్టలు సర్ద సాగింది. వస్తుంటే తల్లి బొట్టు పెట్టి ఇచ్చిన ఇరవై రూపాయల నోటును—' నీకు నేను ఇదివరకు ఇరవై రూపాయలు ఇవ్వాలి. ఇవి తీసుకో. ఇక నీకూ, నాకూ బాకీ ఏమీ లేదు'' అంటూ తిరిగి ఇచ్చేసింది. తల్లి విస్తుబోతూ చూస్తుంటే బాగ్‌తో బయటకు వచ్చింది. సంధ్య వైపు, వదిన వైపు చిరునవ్వుతో చూసింది—వెళ్ళొస్తాం అనే భావం కన్పించేట్లు. తండ్రితో చెప్పి భర్త ననుసరించింది. అతనికి అంతా తెలుసు. తను రెక్కలు విరిగిన పక్షి. తిరిగి సంపాదించే శక్తిలేని ముసలివాడు. కొడుకు, తల్లి వాళ్ళూ వాళ్ళూ ఒకటి. తను మంచి సలహా ఇవ్వగలడు. కన్నీరు కార్చగలడు. అంతే.

బస్సులో వనజ మూర్తిచేతిని తన చేతిలోకి తీసుకుని బాధగా అడిగింది—''బాధపడుతున్నారా?'' అని. అన్ని తెలిసిన అనుభవజ్ఞునిలా నవ్వాడు మూర్తి.

''పిచ్చిదానా! నువ్వు ఫీల్ అవుతున్నావనే నా బాధ. మామగారు రాత్రి అంతా చెప్పారు. బట్టల విషయం నుండి కుటుంబ విషయాలదాకా. నేను ఆయనగారి మాట కాదనలేను. నువ్వు బాధపడుతుంటే కుమిలి పోయాను. నిన్ను బాధ పెట్టడం నాకు సరదా! ఈ సారి నిన్ను బలవంతంగా తీసుకురాను. కానీ, నేను మాత్రం వస్తాను ఆయనగార్ని చూసుకోవటానికి'' అంటున్న భర్త వేపు కన్నీళ్ళతో చూసింది వనజ. ★




అందుకోసమే ప్రొటీన్లతో నిండిన
హేలో ఎగ్
షాంపూ

తగినంత పోషణ లేకపోతే, మీ జుట్టు పల్చగా, నిర్జీవంగా వెలవెల పోతూ కనిపించవచ్చు. మొఖమల్‌లా మెరిసే బంగారు రంగు గల మృదువైన హేలో ఎగ్ షాంపూ, తన ప్రొటీన్ సమృద్ధమైన పోషక సూత్రీకరణతో మీ జుట్టును మళ్లీ అందంగా తీర్చి దిద్దుతుంది. దానికి కావలసిన పౌష్టిక తత్వం అంతా ఇస్తుంది. మీ జుట్టు హేలో ఎగ్ షాంపూ యొక్క పాల మీగడలాంటి నురుగు మీ జుట్టులోకి చొచ్చుకు పోయి, దాన్ని సజీవంగా, శుభ్రంగా మిలమిల మెరిసేలా చేస్తుంది.

హేలో ఎగ్ షాంపూ...
దట్టమైన, మరింత దిట్టమైన జుట్టు కోసం.

HES.G.6 TL